## అందుబాటులో జీలుగ విత్తనాలు

ధర్పల్లి, మే18: మండలంలోని రైతులకు అందుబాటులో సబ్సిడీపై జీలుగ విత్తనాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండంలోని మూడు క్లస్టర్ల పరిధిలో ధర్పల్లి, హోన్నాజీపేట, రామడ్గు సొసైటీల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వరి సాగు చేసే పొలంలో వీటిని విత్తాలని, 35 నుంచి 40 రోజుల దశలో భూమిలో కలియదున్నాలని సూచించారు. దీంతో భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందని పేర్కొన్నారు. అధికంగా రసాయనిక ఎరువులను వాడాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. ప్రభుత్వం 30 కిలోల జీలుగ విత్తనాల బ్యాగ్‌ను 50 శాతం సబ్సిడీపై రూ.2,137.50, 40 కిలోల జనుము బస్తాను 50 శాతం సబ్సిడీపై రూ.2,510కు రైలుకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకువచ్చి తీసుకెళ్లాలని సూచించారు.

## విద్యుదాఘాతంతో గేదె మృతి

పొతంగల్, మే 18: పొతంగల్ శివారులో ఆదివారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. బాధిత రైతు కొట్టాల గంగారాం తెలిపిన వివరాలు.. రైతు గంగారాంకు చెందిన గేదె వ్యవసాయ పొలం వద్ద మేతకు వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్‌కు తగిలి తగలడంతో విద్యుత్ షాక్‌కు గుర్తై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.లక్ష విలువ ఉంటుందని రైతు తెలిపాడు. ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండడంతోపాటు ఫెన్సింగ్ వేయకపోవడంతో ఈ ఘటన జరిగిందని రైతు తెలిపాడు. ట్రాన్స్‌కో అధికారులు పరిహారం చెల్లించాలని కోరాడు

## మహాసభల ఆహ్వాన సంఘం ఎన్నిక

ఖలీల్‌వాడి, మే 18: జూన్ 21, 22 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఎన్నిక రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ అధ్యక్షతన నగరంలోని కోటగల్లీలో ఆదివారం నిర్వహించారు. ఆహ్వాన సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, సూర్యం, నరేందర్, ఆఫీస్‌బేరర్లు, సభ్యులుగా, జిల్లాలోని మేధావులు, డాక్టర్లు, లాయర్లు, ఉద్యోగ సంఘాల బాధ్యులు, సామాజిక వేత్తలు, ప్రజాసంఘాల బాధ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, పద్మ, ముత్తెన్న సుధాకర్, ప్రభాకర్, రవీందర్, రామకృష్ణ, రాధాకిషన్, రాజేశ్వర్, గంగాధర్, అరవింద్, మల్లేశ్, కిషన్, సత్తెక్క, సంధ్యరాణి, మల్కన్న, భాస్కరస్వామి, ప్రేమ్‌సింగ్, సుధారాణి, కె.గణేస కిరణ్, రవి, సాయిబాబా పాల్గొన్నారు.

### బోనాల ఊరేగింపు



బోనాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

డిచ్‌పల్లి, మే 18: ఖిల్లా డిచ్‌పల్లి, ఘన్‌పూర్ గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి భారీగా పంటలు పండాలని గ్రామ దేవతలను కోరుకున్నట్లు వీడీసీ సభ్యులు తెలిపారు. బోనాలను నైవేద్యంగా గ్రామదేవతలకు సమర్పించారు.

# ముందుకు సాగని అభివృద్ధి పనులు

- నత్తనడకన కాలూర్ సొసైటీ బ్రాంచ్ కార్యాలయం, గోడౌన్ నిర్మాణం
- రెండేండ్ల క్రితం మంజూరైన రూ.12 లక్షలతో స్లాబ్ వరకు పనులు పూర్తి
- నిధులు లేక యేడాది నుంచి నిలిచిన పనులు

సారంగాపూర్, మే 18: మండలంలోని గుండారం సొసైటీ పరిధిలో ఉన్న రైతుల సౌకర్యార్థం చేపట్టిన బ్రాంచ్ కార్యాలయంతోపాటు గోడౌన్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. బ్రాంచ్ కార్యాలయం, గోడౌన్ నిర్మాణ పనుల కోసం సొసైటీ జనరల్ ఫండ్ నుంచి రెండేండ్ల క్రితం రూ.12 లక్షలు నిధులు కేటాయించారు. అప్పటి రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శంకుస్థాపన చేయగా పనులు ప్రారంభించి స్లాబ్ లెవల్ వరకు పూర్తి చేశారు. అనంతరం నిధులు మంజూరు కాకపోవడంతో యేడాది నుంచి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అసంపూర్తిగా మిగిలిన బ్రాంచ్ ఆఫీస్, గోడౌన్ పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కాలూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు ప్రస్తుత ఎమ్మెల్యే భూపతిరెడ్డికి విన్నవించగా ఎస్‌డీఎఫ్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో పనులు చేపట్టేందుకు ఏప్రిల్ 14న ఎమ్మెల్యే భూపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. అయితే ఇప్పటి వరకూ పనులు ప్రారంభించలేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బ్రాంచ్ కార్యాలయం, గోడౌన్ నిర్మాణ పనులు పూర్తి కావాలంటే రూ.10లక్షల నిధులు అవసరమవుతాయని రైతులు చెబుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే కేటాయించిన రూ.5 లక్షలతో పనులు ప్రారంభిస్తే మళ్లీ రూ.5 లక్షలు అడగడానికి అవకావముంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఎరువులు, విత్తనాల కోసం తాము గుండారం సొసైటీకి వెళ్లి రావటంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ నిర్మిస్తున్న బ్రాంచ్ ఆఫీస్, గోడౌన్ పనులు పూర్తయితే అన్నీ ఇక్కడి నుంచే పొందడానికి అవకావముంటుందని రైతులు అంటున్నారు. ఇకనైనా ఎమ్మెల్యే మంజూరు చేసిన రూ. 5లక్షలతో పనులు ప్రారంభించేలా అధికారులు చూడాలని రైతులు కోరుతున్నారు.



కాలూర్‌లో అర్ధంతరంగా నిలిచిన సొసైటీ బ్రాంచ్ కార్యాలయం, గోడౌన్ నిర్మాణ పనులు

## గ్రీన్ ఇండియా హరితసేన కార్యవర్గం ఎన్నిక



మొక్కలు నాటుతున్న నాయకులు

ఖలీల్‌వాడి, మే 18: మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా హరిత సేన అర్బన్ ఇన్‌చార్జిగా పట్టె భాస్కర్, కోఆర్డినేటరగా భోజ నారాయణ ఆదివారం ఎన్నికయ్యారు. గ్రీన్ ఇండియా హరిత సేన కార్యవర్గ సభ్యులతో కలిసి ఎమ్మెల్సీ కవిత క్యాంపు కార్యాలయం వద్ద నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కోఆర్డినేటర్ భోజనారాయణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రారంభించిన గ్రీన్ ఇండియా హరిత సేన కార్యక్రమంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని అన్నారు.

## అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి, మే 18: రాష్ట్రంలోని రైతులు అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తున్నదని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూరల్ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని, ఇప్పటికే 4 వేలకుపైగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించామని అన్నారు. జిల్లాలో రికార్డు స్థాయిలో 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందని అన్నారు. 95 శాతం మేర ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి, నాయకులు మునిపల్లి సాయారెడ్డి, చెలిమెల శ్రీనివాస్, నర్సయ్య, గంగారెడ్డి, నరేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఆఫీసులో చోరీకి యత్నం



ధ్వంసం చేసిన లాకర్‌ను పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో

వినాయక్‌నగర్, మే18: నిజామాబాద్ నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో తాళం వేసి ఉన్న ఓ ఆఫీస్‌లో దొంగలు చోరీకి యత్నించారు. ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి కథనం మేరకు.. ధర్నాచౌక్ వద్ద ఉన్న ఆర్కే బిల్డర్స్ షాపును ప్రతి రోజు మాదిరిగానే శనివారం రాత్రి 10.30 గంటలకు గుజ్జ రవికృష్ణ బంద్ చేసి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం కార్యాలయం తెరిచేందుకు వచ్చి చూడగా షట్టర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్‌హెచ్‌వో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. లాకర్ తాళాలు పగలగొట్టి ఉండడంతో దుండగులు చోరీకి యత్నించినట్లు గుర్తించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

## సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నేసాబ్

రుద్రూర్, మే18: కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె అనివార్య కారణాలతో జూలై 9కి వాయిదా పడినట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న కార్మికులు వివిధ రూపాల్లో ఎక్కడిక్కడ నిరసనలు చేపట్టాలని సూచించారు. కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయన్నారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ మహ్మద్ రఫీఖ్, రవీందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పదంగా యువకుల సంచారం

- మాస్కులు ధరించి బైక్‌పై వచ్చిన అనుమానితులు
- కాలనీవాసులు ప్రశ్నించేలోగా పారిపోయిన వైనం

వినాయక్‌నగర్, మే18: ముఖాలకు మాస్కులు ధరించి బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతూ హల్‌చల్ చేశారు. బైక్‌పై అటు, ఇటూ చక్కర్లు కొడుతుండంతో అనుమానం వచ్చిన స్థానిక మహిళలు కాలనీవాసులకు తెలిపారు. బైక్‌పై తిరిగిన వారిని కాలనీవాసులు ప్రశ్నించేలోగా వారు పారిపోయాడు. వినాయక్‌నగర్ ప్రాంతంలోని కాళీకా దేవి ఆలయం ఉన్న కాలనీలో శనివారం సాయంత్రం ముఖాలకు మాస్కులు ధరించి ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చారు. వారు అటూ, ఇటూ చక్కర్లు కొట్టడంతో వారిని అక్కడే ఉన్న పలువురు మహిళలు గమనించారు. వారు చైన్ స్నాచింగ్ చేసేందుకు వచ్చారా లేక ఇతర ఏదైనా చోరీ చేసేందుకు వచ్చారా అనే అనుమానంతో స్థానిక మహిళలు వారి ఇండ్లలో తెలిపారు. వెంటనే స్థానికులు ప్రశ్నించేలోగా అనుమానితులు అక్కడి నుంచి పారిపోయారు. వారు చైన్ స్నాచింగ్ చేసేందుకు వచ్చి ఉంటారని కాలనీవాసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఫోర్త్ టౌన్ ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా తమకు సమాచారం అందలేదని పేర్కొన్నారు.

## వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎస్సైకి గాయాలు

వినాయక్‌నగర్, మే18: వాహనాల తనిఖీ సమయంలో ప్రమాదవశాత్తు నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్సై రహమతుల్లాకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. శనివారం మధ్యాహ్నం ట్రాఫిక్ ఎస్సై రహమతుల్లా తన సిబ్బందితో కలిసి భగత్‌సింగ్ చౌరస్తా, పెట్రోల్ బంక్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో అటువైపుగా వచ్చిన ఓ బైక్‌ను పక్కకు నిలుపాలని ఎస్సై సూచించారు. దీంతో బైక్ వేగాన్ని యువకుడు తగ్గించాడు. అదే సమయంలో బైక్‌ను ఎస్సై పట్టుకోగానే బైక్‌పై ఉన్న యువకుడు వేగంగా ముందుకెళ్లాడు. దీంతో ఎస్సై అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో అతని ఎడమ చేతి భుజం ఎముకకు బలమైన గాయమైంది. ఆయనను చికిత్స కోసం దవాఖానకు తీసుకువెళ్లారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయలేదని ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. మెరుగైన వైద్యం కోసం ఎస్సై రహమతుల్లాను హైదరాబాద్ దవాఖానకు తీసుకువెళ్లినట్లు తెలిపారు.

## మట్టి రవాణా నిలిపివేత

పొతంగల్, మే18: అక్రమంగా మట్టి, మొరం తరలిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మండలంలోని కొడిచర్ల శివారులో ఉన్న ఓ చెరువు నుంచి ఆదివారం కొందరు అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నట్లు తహసీల్దార్ గంగాధర్‌కు సమాచారం వచ్చింది. ఈ విషయంపై ఆయన పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మట్టి రవాణాను అడ్డుకున్నారు.

## కొబ్బరి చెట్టుపై పిడుగు



పొతంగల్, మే 18: మండలంలోని హంగర్గ శివారులో శనివారం సాయంత్రం కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. సాయంత్రం ఈదురుగాలులతోపాటు పెద్ద శబ్దాలతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో పంట పొలాల్లోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. అదృష్టవశాత్తు పిడుగు పడిన సమయంలో పశువులు, మనుషులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

### ఐక్యంగా సేవా కార్యక్రమాలు
## చేపట్టడం అభినందనీయం



శక్కర్‌నగర్ సీఎస్ఐ చర్చిలో వేదికను ప్రారంభిస్తున్న కె. రూబెన్ మార్క్

శక్కర్‌నగర్, మే 18 : బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని సీఎస్ఐ సెయింట్ పాల్స్ చర్చిలో ప్రతి ఒక్కరూ ఐక్యంగా సంఘ సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయం, అభినందనీయమని డిప్యూటీ మోడరేటర్, బిషప్ ఇన్‌చార్జి, సీఎస్ఐ మెదక్ డయాసీ ప్రొఫెసర్ డాక్టర్ కె. రూబెన్ మార్క్ అన్నారు. ఆదివారం శక్కర్‌నగర్‌లోని సీఎస్ఐ చర్చిలో బోర్‌వెల్, వేదిక (స్టేజ్), చర్చి హాల్‌లో ఏర్పాటు చేసిన ఏసీలను ఆయన ప్రారంభించారు. ఉదయం చర్చిలో ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేసి, పారంభోత్సవాలు నిర్వహించి అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ రెవరెండ్ ఎం. ప్రభాకర్, ప్రెస్‌బైటర్ ఇన్‌చార్జి దమ్మల్ల జ్యోతిరాజ్, పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

## సైబర్ మోసంపై విచారణ

నవీపేట, మే 18: సైబర్ నేరగాళ్ల చేతిలో ఓ రైతు మోస పోయిన ఘటన పై ఆదివారం విచారణ ప్రారంభించనున్నట్లు ఎస్సై వినయ్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలోని పొల్డ గ్రామానికి చెందిన ఓ రైతుకు ఈ నెల 15న ఎయిర్‌టెల్ కంపెనీ నుంచి గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా వాట్సాప్ కాల్ వచ్చింది. నీ ఫోన్ నంబర్ బ్లాక్ అవుతుంది లేదంటే నిన్ను అరెస్టు చేస్తామని భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో బాధిత రైతు అదే రోజు ఫోన్ పే ద్వారా రూ. 90 వేలు పంపించాడు. రెండో రోజు కెనరా బ్యాంక్ నుంచి తన పేరు మీద ఖాతా ఓపెన్ చేసి ఏటీఎం తీసుకొని వాట్సాప్ కాల్ ద్వారా చూపించారు. దీంతో భయపడి పోయిన సదరు రైతు మరో రూ. 33 వేలు ఫోన్‌పే ద్వారా పంపించాడు. సైబర్ మోసగాళ్ల చేతిలో రూ. 1.23 లక్షలు మోసపోయిన బాధిత రైతు 1930 సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## 'దళితులపై దౌర్జన్యాలను ఖండిస్తున్నాం'

ఆర్మూర్‌టౌన్, మే18: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, దళిత బహుజన నాయకులు కలిసి అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజూ ఏదో ఒక మూలన ఎస్సీ, ఎస్టీల పై దౌర్జన్యాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని దౌర్జన్యాలను ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా దళితులపై దాడులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## చివరి దశకు చేరిన ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పనులు

బోధన్ రూరల్, మే 18 : మండలంలోని ఊట్‌పల్లి గ్రామ ఒడ్డెర కాలనీలోని ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. ఆలయ నిర్మాణానికి గ్రామస్తుల వినతి మేరకు స్థానిక ఎమ్మెల్యే పి. సుదర్శన్‌రెడ్డి రూ. 2 లక్షలు ఎన్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయించినట్లు నాయకులు టప్ప సాయిలు, చామకూర సాయారెడ్డి, ఒడ్డెర సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి, సహకరించిన పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు.

# శిథిలావస్థలో కల్వర్టు ..

- కూలి పోయే స్థితిలో ఉన్నా పట్టించుకోని అధికారులు
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.40 లక్షల నిధులు మంజూరు
- విడుదల చేయని కాంగ్రెస్ ప్రభుత్వం..
- స్పందించాలని కోరుతున్న ప్రజలు

వేల్పూర్, మే 18: మండల కేంద్రం నుంచి మోతె గ్రామం వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. అయినా సంబంధిత అధికారులు , పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేల్పూర్ పెద్దవాగు సమీపంలో రోడ్డుపై కొంత కాలం క్రితం కల్వర్టు నిర్మించారు. ఈ కల్వర్టు కింది నుంచి పంట పొలాలకు నీరు ప్రవహిస్తున్నది. ఇటీవల భారీ వర్షాలకు మోతె పెద్ద చెరువు నుంచి అలుగు పారి కల్వర్టు దెబ్బతిన్నది. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్వర్టు నిర్మాణానికి రూ.40లక్షలు నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరైన కొన్ని రోజులకే రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. దీంతో కల్వర్టుకు మంజూరైన నిధులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఈ దారి గుండా నిత్యం భీమ్‌గల్ వైపు నుంచి వందల వాహనాలు తిరుగుతుంటాయి. వేల్పూర్ నుంచి భీమ్‌గల్ వైపు వెళ్లాలంటే ఈ దారి గుండా వెళ్లాల్సిందే. ఈ దారి గుండా భారీ వాహనాలు వెళుతుండడంతో కల్వర్టు ఎప్పుడు కూలుతుందోనని, కల్వర్టు కూలితే పెద్దప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని ఇక్కడి ప్రజలు భయపడుతున్నారు. రోడ్డు కింది భాగంలో కల్వర్టు కింద ఉన్న రాళ్లు మొత్తం నీటి ప్రవాహంలో కొట్టుకపోయి కొన్ని రాళ్లపైనే రోడ్డు ఉన్నదని.. ఆ రాళ్లు కూడా పక్కకు జరిగిపోతే కల్వర్టు ఒక్కసారిగా కింద పడి కూలిపోయే అవకాశం ఉన్నదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణాని నిధులు మంజూరు చేసి కొత్తది నిర్మించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థలో కల్వర్టు



గత ప్రభుత్వ హయాంలో కల్వర్టు నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకం

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు


- పట్టణ సీఐ వెంకట నారాయణ

శక్కర్‌నగర్, మే 18: రోడ్డుపై వెళ్లే వాహనదారులు నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ వెంకట నారాయణ సూచించారు. బోధన్ పట్టణంలో ఆదివారం వాహనాల తనిఖీతో పాటు వాహనదారులకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు హెల్మెట్ తప్పక ధరించాలని, వీటితో పాటు అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ఆయన సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మైనర్లు వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు. ఇప్పటికే పలుమార్లు మైనర్లు, వారి తండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించామని, అయినా కొందరు వాహనాలను తమ పిల్లలకు ఇస్తున్నారని పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు చేపడతామని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. వాహనాల చట్టం ప్రకారం కేసుల నమోదుతో పాటు పోలీస్‌శాఖ పరంగా కూడా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.



బోధన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

## డ్రైనేజీలు తీయక పోవడంతో దుర్గంధం



ఇంటివద్ద డ్రైనేజీని శుభ్రం చేసుకుంటున్న లింగం

మాక్లూర్, మే 18 : మండలంలోని ఒడ్యాట్‌పల్లి గ్రామంలో పంచాయతీ సిబ్బంది డ్రైనేజీలు తీయక పోవడంతో చెత్త పేరుకు పోయి దుర్గంధం వ్యాపిస్తున్నదని గ్రామానికి చెందిన నీలం లింగం తెలిపారు. ఎన్ని పర్యాయాలు చెప్పినా గ్రామ సిబ్బంది, కార్యదర్శి పట్టించుకోవడం లేదన్నారు. దీంతో విసుగు చెందిన నీలం లింగం ఇంటి సభ్యులు తమ ఇంటి ముందు ఉన్న డ్రైనేజీలోని మురికిని వారే శుభ్రం చేసుకున్నారు. దోమల బెడద, అంటు రోగాల బారిన పడకుండా ఉన్నాతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## స్వచ్ఛ ఆర్మూర్ ఆధ్వర్యంలో శ్రమదానం

ఆర్మూర్‌టౌన్, మే18: పట్టణంలోని స్వచ్ఛ ఆర్మూర్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డులోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో శ్రమదానం నిర్వహించారని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాగౌడ్ ఆదివారం తెలిపారు. ఆలయ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు, పరిసరాలను శుభ్రం చేశారని పేర్కొన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అందజేత

ఏర్గట్ల, మే 18: మండలంలో పోగొట్టుకున్న సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాము ఆదివారం అందజేశారు. గతంలో సెల్‌ఫోన్ పోయిందని వివిధ గ్రామాలకు చెందిన బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ ద్వారా నాలుగు ఫోన్లను వివిధ ప్రాంతాల్లో స్వాధీనం చేసుకుని అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బోధన్, మే 18: సాలూర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2003-2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన పూర్వ ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు గోపాల్ రెడ్డి, మనోహర్‌తో పాటు సాలూర మండల ఎంఈవో రాజీ మంజూష హాజరయ్యారు.

మోర్తాడ్, మే 18 : కమ్మర్‌పల్లి ఉన్నతపాఠశాలలో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈసందర్భంగా చదువు చెప్పిన గురువులను కార్యక్రమానికి ఆహ్వానించి వారిని సన్మానించారు. చదువుకున్న సమయంలో చేసిన అల్లరి పనులు గుర్తు చేసుకుని, ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు.



సాలూర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు




కమ్మర్‌పల్లి ఉన్నతపాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 1997-98 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

## సబ్సిడీపై జీలుగ విత్తనాలు

భీమ్‌గల్, మే 18: మండలంలోని చేంగల్, ముచ్కూర్, భీమ్‌గల్‌లోని వ్యవసాయ సహకార సంఘాల గోదాముల్లో ప్రభుత్వం సరఫరా చేసిన జీలుగ విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి పి. లావణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన రైతులు తమ పట్టాదార్ పాస్‌బుక్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకు వచ్చి, డబ్బులు చెల్లించి విత్తనాలను తీసుకువెళ్లాలని పేర్కొన్నారు.

**నేడు కల్లడిలో పంపిణీ..**

మాక్లూర్, మే 18 : మండలంలోని కల్లడి గ్రామంలోని సహకార సంఘం గోదాం వద్ద సోమవారం ఉదయం జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తామని పీఏసీఎస్ అధ్యక్షుడు బుర్రోల్ల అశోక్ ఆదివారం తెలిపారు. కల్లడి, డీకంపల్లి, రామచంద్రాపల్లి, గుత్ప, చిన్నాపూర్, అడవిమామిడిపల్లి గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## రేపటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

మోర్తాడ్, మే 18 : ఈనెల 20 నుంచి 24 వరకు ఐదురోజుల పాటు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాల్లో పని చేస్తున్న ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు, సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం మోర్తాడ్‌లోని బాలికల ఉన్నతపాఠశాలలో నిర్వహిస్తామని ఎంఈవో సమ్మిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని, ఈ కార్యక్రమానికి ఉర్దూ మీడియం పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు రానవసరం లేదని పేర్కొన్నారు.

**ఉపాధ్యాయులకు శిక్షణ ..**

బాల్కొండ, మే 18 : ప్రాథమిక స్థాయిలో బోధించే మండల స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం జడ్పీహెచ్‌ఎస్ బాల్కొండలో ఈనెల 20 నుంచి 24 వరకు నిర్వహిస్తామని, ఈ శిక్షణకు ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలతో హాజరు కావాలని ఎంఈవో తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి ఎస్జీటీ, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు, ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఎస్జీటీలు కూడా హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## ఎస్సారెస్పీలోకి 1,736 క్యూసెక్కుల వరద

మోర్తాడ్, మే 18 : ఎగువ భాగంలో కురుస్తున్న అడపాదడపా వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్వల్పంగా వరద వస్తున్నది. శనివారం 1,447 క్యూసెక్కుల వరద రాగా ఆదివారం 1,736 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు(80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1,060.70అడుగులు (11.23టీఎంసీలు) నీరు నిలువ ఉన్నది. కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. 302 క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నది.

## ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

నవీపేట, మే 18: మండలంలోని నిజాంపూర్ వాగులో నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని స్థానిక తహసీల్దార్ వెంకటరమణ ఆదివారం హెచ్చరించారు. నిజాంపూర్ గ్రామానికి చెందిన పలువురు ట్రాక్టర్ యజమానులు గ్రామ కమిటీతో ఒప్పందం చేసుకొని వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తవ్వుతూ మండలంలోని పలు గ్రామాలకు సరఫరా చేస్తూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్న వారికి అనుమతులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. కొన్ని రోజుల నుంచి నిజాంపూర్ వాగులో నుంచి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న అక్రమ ఇసుక రవాణాను ఆదివారం అడ్డుకున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.